సాక్షి ప్రకాశం

శుక్రవారం । 11 । జూలై । 2025



కడగండ్లకు కారకులెవరు?
కనిగిరి నియోజకవర్గంలో చెరువులు, కాలువలు, రిజర్వాయర్లు అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మారాయి.

- 8లో..



నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు
మహిళలు, చిన్నారులపై నేరాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించారు.


- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37 /27

వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సర్వం సాయి..



ఒంగోలు సంతపేట ఆలయంలో మత్స్యకార అలంకరణలో సాయినాథుడు

గురుపౌర్ణమి వేడుకలు జిల్లావ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరిగాయి. సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సాయినాథులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఒంగోలులోని సంతపేట, లాయర్‌పేట సాయి మందిరాలు కిటకిటలాడాయి. సామూహిక పూజలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భారీగా తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

– సాక్షి, ఒంగోలు

వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా చావలి శివప్రసాద్‌ను నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించిన ఎస్‌ఈ



ట్రాన్స్‌ఫార్మర్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) కట్టా వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఇందిరాకాలనీ, పులివెంకటరెడ్డికాలనీలో లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా నూతనంగా ఏర్పాటు చేసిన 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేశారు. అనంతరం ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీకాంత్, ఏఈఈ ఎంఎస్‌వీ రవిప్రకాష్ పాల్గొన్నారు.

మా పిల్లలకు చదువు దూరం చేయొద్దంటూ హనుమంతునిపాడు మండలంలో నిరసనలు.. మురుగునీటితో తమ పిల్లలు రోగాల పాలవుతున్నారంటూ పెద్దదోర్నాల కేజీబీవీ కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రుల ఆగ్రహం.. ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారంటూ మద్దిపూడిలో తల్లిదండ్రుల అసంతృప్తి.. జిల్లాలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల్లో అనేకచోట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ సమావేశాలకు అధికార పార్టీ నాయకులు, అధికారుల హంగామాలు తప్ప తల్లిదండ్రుల హాజరు 30 శాతం కూడా లేదు. అతిథుల ఊకదంపుడు ఉపన్యాసాలు మినహా విద్యార్థుల భవిష్యత్‌పై చర్చ జరగకపోవడం గమనార్హం. ఈ సమావేశాలకు ప్రభుత్వం బెత్తెడు నిధులు విడుదల చేయడంతో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ఆర్థిక భారాన్ని మోయాల్సి వచ్చింది.

నేతల సంబరం.. తల్లిదండ్రుల గరం..!



మంగంపల్లిలో మా పిల్లలను దూరంలో ఉన్న పాఠశాలకు పంపమంటూ ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు

- మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- జిల్లా వ్యాప్తంగా 30 శాతం దాటని హాజరు
- అతిథులు, నేతల ఊకదంపుడు ఉపన్యాసాలు
- విద్యార్థుల భవిష్యత్‌పై చర్చ శూన్యం
- ప్రభుత్వ గొప్పల కోసం టీచర్లపై భారం
- అరకొర నిధులతో హెచ్‌ఎం జేబుకు చిల్లు
- పలు ప్రాంతాల్లో సమస్యలపై నిరసనలు

సాక్షి ప్రతినిధి ఒంగోలు/ఒంగోలు సిటీ:

పేరుకే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం (పీటీఎం).. కానీ, జిల్లా అంతటా ఈ సమావేశాలు మొక్కుబడిగా సాగాయి. రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా 2,955 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, 188 జూనియర్ కళాశాలల్లో పీటీఎం సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు స్కూళ్లలో సమావేశాలు జరగలేదని తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సమావేశాలకు హంగూ, ఆర్భాటాలు చేశారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు హాజరై ప్రభుత్వాన్ని కీర్తించారు. ఏడాది కాలంగా ప్రభుత్వం సర్కార్ పాఠశాలలను నిర్వీర్యం చేసింది. తల్లికి వందనం తొలి ఏడాది ఎగ్గొట్టి రెండో ఏడాదికి సంబంధించి గత నెలలో నిధులు విడుదల చేసింది. రకరకాల కారణాలు చెబుతూ జిల్లా వ్యాప్తంగా లక్ష మందికిపైగా విద్యార్థులకు ఎగనామం పెట్టింది. దీంతో ఈ సమావేశాలకు వచ్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపించలేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రుల హాజరు 30 శాతం కూడా దాటలేదని తెలుస్తోంది. సమావేశాల్లో సమస్యలపై మాట్లాడవద్దని విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు ముందుగానే చెప్పించినట్లు తెలిసింది. ఇటీవల యోగాంధ్ర పేరుతో వారం రోజుల పాటు చదువుకు దూరమయ్యారని, ఇప్పుడు ఉపయోగం లేని మీటింగులతో మరో వారం రోజుల పాటు మొక్కుబడిగా పాఠాలు సాగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పెట్టిన ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం కేవలం ప్రచార ఆర్భాటానికే పనికొస్తోందని పలువురు తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

నిర్వాహకులకు వదిలిన చేతి చమురు..

పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పేరిట ప్రభుత్వం ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లపై ఆర్థిక భారాన్ని మోపింది. ఈ కార్యక్రమానికి సంబంధించి విడుదల చేసిన అరకొర నిధులు కూడా ఇంతవరకు జమ కాలేదని తెలిసింది. దీంతో చేసేదేమీ లేక తమ చేతి నుంచి ఖర్చు పెట్టాల్సి వచ్చిందని పలువురు హెచ్‌ఎంలు లోలోన మదనపడుతున్నారు. ఈ సమావేశాల నిర్వహణకు రూ.7 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చయిందని, ఆ సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోతే ఆర్థికంగా నష్టపోతామని వారు వాపోతున్నారు.

పేరెంట్స్ సమావేశం కాదు.. టీడీపీ సంబరాలు..!



త్రిపురాంతకం మండలం గణపవరంలో ప్రిన్సిపాల్‌తో వాదిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్

యర్రగొండపాలెం: ప్రభుత్వం పాఠశాలల్లో అట్టహాసంగా నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం కాస్తా టీడీపీ సంబరాలుగా మారాయి. ఈ సమావేశాల్లో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ కార్యాచరణ, ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలపై చర్చించడం లాంటివి జరగాల్సి ఉంది. అందుకు భిన్నంగా టీడీపీ నాయకులు సమావేశాల్లో పాల్గొని ఊకదంపుడు ప్రసంగాలతో ముగించారు. ఈ సమావేశాల్లో పేరెంట్స్ కేవలం 40 శాతం మంది మాత్రమే పాల్గొన్నారు. గణపవరం గురుకుల పాఠశాలలో సమావేశం ప్రారంభం కాకముందే ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌తో ఎస్‌ఎంసీ చైర్మన్ వాదనకు దిగారు. పేరెంట్స్–టీచర్స్ సమావేశం జరుగుతుందని తమకు సమాచారం ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. పెద్దదోర్నాల కేజీబీవీ కళాశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు కళాశాల ప్రాంగణంలోకి చేరుతున్న మురుగునీరు, కోతుల బెడదపై ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలతో తమ పిల్లలు తరచూ అనారోగ్యం పాలవుతున్నారని, కోతులు కళాశాలలో ఎక్కువగా ఉంటున్నాయని, దుస్తులు శుభ్రం చేసుకుని ఆరబెట్టుకునే సమయంలో అవి తమ పిల్లలపై ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళనగా ఉందని అన్నారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు పాఠశాలల్లో జరిగిన పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో ఎటువంటి అర్హతలేని పచ్చనేతలు పాల్గొన్నారు. సమస్యలపై చర్చించేందుకు వెళ్లిన తల్లిదండ్రులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

తల్లిదండ్రుల స్పందన అంతంతే...

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలో నిర్వహించిన సమావేశాలకు తల్లిదండ్రుల నుంచి స్పందన కరువైంది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం సమావేశాలు భారీగా నిర్వహించాలంటూ హడావిడి చేయడం తప్ప అవసరమైన నిధులు ఇవ్వలేదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కేవలం 20 శాతం మాత్రమే పాల్గొన్నారు. సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం జెడ్పీ హైస్కూలులో విద్యార్థులు 272 మంది హాజరు కాగా, తల్లిదండ్రులు కేవలం సుమారు 75 మంది మాత్రమే హాజరయ్యారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలలు కొన్ని మాత్రమే పేరెంట్స్ మీటింగ్ నిర్వహించగా, మరికొన్ని ప్రైవేటు పాఠశాలలు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోలేదని తెలిసింది.

జరుగుమల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 320 మంది ఉండగా, తల్లిదండ్రులు కేవలం 140 మంది మాత్రమే హాజరయ్యారు. టంగుటూరు మండలం జమ్ములపాలెం ప్రాథమిక పాఠశాలలో 63 మందికిగానూ 20 మంది తల్లిదండ్రులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 133 మంది విద్యార్థులకుగానూ 43 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. మద్దిపూడి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 126 మంది విద్యార్థులకుగానూ 40 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు.

పాఠశాలల కుదింపు మానుకోవాలి...

హనుమంతునిపాడు: హనుమంతునిపాడు మండలంలోని మంగంపల్లి ఎస్సీకాలనీలో, రేఖదుపురంలో, కూటాగుండ్లలో సమావేశాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అడ్డుకున్నారు. మా పిల్లలను మా బడిలోనే చదివించాలని, దూరంగా ఉన్న పాఠశాలకు పంపమంటూ నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను నిలదీసి ధర్నాకు దిగారు. ప్రభుత్వం పేదలు, దళితులు నివసించే ప్రాంతాల్లో పాఠశాలలను కుదించడం మంచి పద్ధతి కాదన్నారు. పాఠశాలల కుదింపును మానుకోవాలని డిమాండ్ చేశారు. చెరువు కట్ట మీదుగా చిల్లచెట్లలో నుంచి పిల్లలు వెళ్లాలంటే కష్టమని, దళితవాడలోని పాఠశాలను దళితవాడలోనే ఉంచాలని ధర్నా చేశారు. హెచ్‌ఎం ఎస్.సుబ్బలక్ష్మిని నిలదీశారు. కూటాగుండ్ల ఎస్సీకాలనీ నుంచి కూటాగుండ్ల మెయిన్ స్కూల్‌కు, రేఖదుపురంలో పిల్లలు కోటతిప్పలకు ఎలా వెళ్లాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి...

మద్దిపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగింది. విద్యార్థులకు ఉడికీ ఉడకని భోజనం పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

మొక్కుబడిగా..

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గంలోని 458 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సగం పాఠశాలల్లో స్పందన కరువైంది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల స్పందన తప్ప విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఆసక్తి కనిపించలేదు. ఆరు మండలాల్లో సగానికిపైగా పాఠశాలల్లో తల్లిదండ్రులు తక్కువగా హాజరయ్యారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 800కుపైగా విద్యార్థులు ఉండగా, తల్లిదండ్రులు 300 మంది కూడా హాజరుకాలేదు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కూడా తల్లిదండ్రులు అంతంతమాత్రంగానే వచ్చారు. మద్దిపాడు మండలంలోనూ తల్లిదండ్రులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు.



మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తక్కువగా హాజరైన తల్లులు

అయ్యో లక్షిత్..

- అదృశ్యమైన బాలుడు మృతి చెందడంతో లింగోజీపల్లి, గొట్లగట్టు గ్రామాల్లో తీవ్ర విషాదం
- సూరేపల్లి శివార్లలో బాలుడి మృతదేహం లభించిన ప్రాంతానికి భారీగా తరలివచ్చిన ప్రజలు
- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు
- సంఘటన స్థలంలోనే బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం
- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పోలీసుల దర్యాప్తు
- అన్ని కోణాల్లో విచారిస్తున్నామన్న సీఐ మల్లికార్జున

కంభం:


ఏదైతే జరగకూడదు అని అందరూ అనుకున్నారో..అదే జరిగింది. అదృశ్యమైన బాలుడు విగతజీవిగా కనిపించడంతో సంఘటన జరిగిన లింగోజీపల్లి, సూరేపల్లి, గొట్లగట్టు గ్రామాలు గొల్లుమన్నాయి. అనుమానాస్పదస్థితిలో మృతి చెంది పడి ఉన్న పసివాడిని చూసి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లారు. బంధువులంతా గుండెలు బాదుకున్నారు. పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారులే.. తప్పిపోయిన పిల్లవాడిని నేడో రేపో ఎలాగైనా పట్టుకొచ్చి ఇస్తారులే అని అందరూ ఆశగా ఎదురుచూశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సైతం శక్తివంచన లేకుండా బాలుడి ఆచూకీ కోసం గాలించారు. ఇంతలోనే సూరేపల్లి గ్రామ శివార్లలోని పంట పొలాల్లో అనుమానాస్పదస్థితిలో బాలుడు మృతిచెంది పడి ఉండటం చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా సంఘటన స్థలానికి చేరుకుని కంటతడి పెట్టారు.

ముమ్మరంగా గాలించినా దక్కని ఫలితం...

కంభం మండలంలోని లింగోజీపల్లి గ్రామానికి చెందిన పాదిలి లక్షిత్ (3) గత మంగళవారం ఉదయం ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి అదృశ్యమయ్యాడు. బాలుడి ఆచూకీ కోసం రెండు రోజుల పాటు పోలీసులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు 5 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. బుధవారం రెండో రోజు లింగోజీపల్లి – సూరేపల్లి మధ్యలో బాలుడి చెప్పులు దొరకడంతో వెంటనే డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. గురువారం ఉదయం సూరేపల్లి గ్రామం వెనుకవైపున్న బీరం రామిరెడ్డికి చెందిన పొలంలో కంది కొయ్యలు ఏరేందుకు వెళ్లిన మహిళలకు బాలుడి మృతదేహం కనిపించింది. గ్రామస్తుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. కంభం, మార్కాపురం, గిద్దలూరు రూరల్ సీఐలు కె.మల్లికార్జున, సుబ్బారావు, రామకోటయ్య, కంభం ఎస్సై నరసింహారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ బాలుడి మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం గ్రామం చివర్లో ఉన్న నల్లవాగు వద్దకు వెళ్లి ఆగింది. క్లూస్ టీం బాలుడి మృతదేహంపై ఉన్న వేలిముద్రలు సేకరించింది. ఈ సంఘటనతో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నపిల్లలను పంపించే తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

బాలుడి మృతిపై పలు అనుమానాలు...

లింగోజీపల్లి, సూరేపల్లి గ్రామాల చుట్టూ ఉన్న పంట



బాలుడి మృతదేహం వద్ద వాసన పసిగడుతున్న పోలీస్ జాగిలం



బాలుడి మృతదేహం

పొలాల్లో బుధవారం డ్రోన్ కెమేరాలతో పోలీసులు విస్తృతంగా గాలించారు. గ్రామస్తులు సైతం వందలాదిగా బాలుడి ఆచూకీ కోసం వెతికారు. గురువారం ఉదయం బాలుడి మృతదేహం దొరికిన పంటపొలంలో బుధవారం బాలుడి మృతదేహం కనిపించలేదు. పంట పొలంలో బాలుడు విగతజీవిగా బోర్లాపడి ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని తిప్పి చూడగా మర్మాంగాల వద్ద కొద్దిగా రక్తం కనిపించినట్లు తెలిసింది. మృతదేహాన్ని బట్టి గురువారం తెల్లవారుజామున బాలుడు చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒంగోలు నుంచి వచ్చిన వైద్య బృందం సంఘటన స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించింది. అనంతరం కుటుంబ సభ్యులకు బాలుడి మృతదేహాన్ని పోలీసులు అప్పగించగా, స్వగ్రామమైన గొట్లగట్టు తీసుకెళ్లారు.

నిందితులు తప్పించుకోవడం కోసమే చంపేశారా..?

బాలుడు అదృశ్యమైన నేపథ్యంలో చిత్తుకాగితాలు ఏరుకునే వారు ఎత్తుకెళ్లి ఉంటారని పోలీసులు, గ్రామస్తులు భావించారు. ఆ కోణంలోనే ప్రాథమికంగా దర్యాప్తు చేశారు. తీరా.. బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది పడి ఉండటంతో కొత్తకొత్త అనుమానాలు రేకెత్తుతున్నాయి. బాలుడిని ఎవరు ఎత్తుకెళ్లారు, ఎందుకోసం ఎత్తుకెళ్లారు, ఎత్తుకెళ్లిన వారు రెండు రోజులు ఎందుకు దాచిపెట్టారో అర్థం కావడం లేదు. ఇది బంధువుల పనా.. లేకుంటే బయటివారి పనా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒక వేళ డబ్బు కోసం బాలుడిని కిడ్నాప్ చేసి.. దొరికిపోతామనే భయంతో చంపేసి పారిపోయారా..? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనప్పటికి పోలీసుల విచారణ ద్వారానే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అక్కాచెల్లెళ్లు ఇద్దరికీ గొట్లగట్టులోనే వివాహం...

లింగోజీపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవులుకు



రోదిస్తున్న బాలుడి తల్లిదండ్రులు, బంధువులు

ఇద్దరు కుమార్తెలు కాగా, మృతిచెందిన బాలుడి తల్లి చిన్న కుమార్తె సురేఖ. చెన్నకేశవులు పెద్ద కుమార్తెను 7 సంవత్సరాల క్రితం కొనకనమిట్ల మండలం గొట్లగట్టుకు చెందిన పాదిలి రంజిత్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. రెండో కూతురు సురేఖ (మృతిచెందిన బాలుడి తల్లి)ను పెద్ద అల్లుడు బంధువు (వరుసకు సోదరుడు) అయిన పాదిలి శ్రీనుకు ఇచ్చి 5 సంవత్సరాల క్రితం వివాహం చేయగా ఇద్దరు పిల్లలు. రెండో కాన్పు కోసం 45 రోజుల క్రితం స్వగ్రామమైన లింగోజీపల్లి వచ్చిన సురేఖకు ఆడ పిల్ల పుట్టగా, ఆమెకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ కూడా చేయించారు. ఈ నేపథ్యంలో కుమారుడు లక్షిత్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది.

అన్నికోణాల్లో విచారిస్తున్నాం...

బాలుడి మృతిపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు కంభం సీఐ మల్లికార్జున తెలిపారు. బాలుడు తప్పించుకుని వచ్చి మృతి చెందాడా.. లేకుంటే ఎవరైనా ఇక్కడికి తెచ్చి చంపి పడేసి వెళ్లారా..? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. విచారణను వేగంగా పూర్తి చేసి పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు...

కొనకనమిట్ల: లక్షిత్ స్వగ్రామమైన కొనకనమిట్ల మండలం గొట్లగట్టులో అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మొన్నటి వరకు గ్రామంలో అల్లారుముద్దుగా తిరుగుతూ కనిపించిన లక్షిత్‌ను విగతజీవిగా చూడలేక స్థానికులు సైతం కన్నీటిపర్యంతమయ్యారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అయ్యో పాపం లక్షిత్.. ఎంత దారుణం జరిగిందంటూ విచారం వ్యక్తం చేశారు. తప్పిపోయాడని, ప్రాణాలతోనే దొరుకుతాడని రెండు రోజులుగా భావించినప్పటికీ.. చివరకు ఇలా జరగటం బాధాకరమంటూ బాలుడి తల్లిదండ్రులను గ్రామస్తులు ఓదార్చారు.

అండగా ఉంటాం..అధైర్యపడొద్దు



కోర్టు ఆవరణలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



కోర్టు ఆవరణ వెలుపల మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- కోర్టు వద్ద కార్యకర్తలను పరామర్శించిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, అన్నా రాంబాబు

పొదిలి: అక్రమ కేసుల్లో అరెస్టై రిమాండ్‌లో ఉన్న కార్యకర్తలకు పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు భరోసా ఇచ్చారు. రిమాండ్‌లో ఉన్న పార్టీ కార్యకర్తలు వాయిదా రోజైన గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు. ఈ మేరకు కార్యకర్తలను కలిసి ధైర్యం చెప్పారు. తప్పు చేయలేదని నిరూపించేంత వరకు పార్టీ లీగల్ టీం న్యాయ సేవలు అండగా ఉంటాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పోరుబాట కార్యక్రమం ఊహించనంత విజయవంతం కావడంతో ఓర్వలేని కూటమి నేతలు అక్రమంగా అరెస్టులు చేయించి జైలుపాలు చేశారన్నారు. తప్పు చేయని కార్యకర్తలు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. పార్టీ కోసం మీరు చేసిన సేవలు గుర్తుంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, మాజీ వార్డు సభ్యులు షేక్.మస్తాన్‌వలి, ముల్లా జాకీర్, రియాజ్, అన్నవరం బ్రహ్మారెడ్డి, దోర్నాల చిన్న నారాయణరెడ్డి, శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసమే లక్ష్యం

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

కొత్తపట్నం: విద్యార్థుల సంపూర్ణ వికాసమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0లో భాగంగా కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ప్రాంగణంలోని సరస్వతిదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం చెంచుపున్నయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులను ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో పాటు విద్యార్థులకు అవసరమైనవన్నీ అందిస్తున్నట్లు చెప్పారు. అవరోధాలను చూసి అధైర్యపడకుండా విద్యార్థులంతా లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఐదుగురు తల్లులకు వారి పిల్లలతో తల్లికి వందనం చేయించారు. తల్లి పేరుతో మొక్కలు నాటిపెంచేలా ఆ విద్యార్థులకు మొక్కలు అందజేశారు. తల్లులకు ముగ్గులు, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో అత్యధిక మార్కులు (591) సాధించిన ఆకురాతి గీతిక, ఆమె తల్లిదండ్రులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు, తహసీల్దార్ శాంతి, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌కృష్ణమూర్తి, సర్పంచ్ కోటేశ్వరరావు, ఎంఈవో–2 పద్మావతి, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, పొందూరి వెంకారెడ్డి, గ్రామ పెద్ద కుంభా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదుమూడిలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నాగులుప్పలపాడు: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన మండలంలోని ఈదుమూడిలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కృష్ణమూర్తి పెంకుడు ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో రూ.50 వేల నగదు, ద్విచక్రవాహనం, ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంతో కట్టుబట్టలతో మిగిలామని బాధితులు వాపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో వాళ్లంతా తాళం వేసి గుడికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ప్రమాదం జరిగిందని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

రూ.1.10 లక్షల నగదు చోరీ

సింగరాయకొండ: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడి రూ.1.10 లక్షల నగదు, వెండి పట్టీలు చోరీ చేశారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని ప్రశాంతి థియేటర్ ఎదురు సందులో నివాసం ఉంటున్న పఠాన్ రఫీఖాన్ నివాసంలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం..రఫీఖాన్ ఈతముక్కలలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. మొహర్రం పండుగను పురస్కరించుకొని భార్య, పిల్లలు ఈతముక్కలలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయని, లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.1.10 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ రెండో సెమిస్టర్ మూల్యాంకనం

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డిగ్రీ రెండో సెమిస్టర్ మూల్యాంకనం ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి తెలిపారు. మూల్యాంకనానికి ఎంపిక చేసిన అధ్యాపకులు యూనివర్సిటీ ఐడీ కార్డులు, తమ కాలేజీ ప్రిన్సిపాల్ లేఖతో కళాశాలలో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు. అధ్యాపకులను తక్షణమే రిలీవ్ చేయాలని ప్రిన్సిపాళ్లను క్యాంప్ ఆఫీసర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 40 రోజుల జైలు

రాచర్ల: మద్యం మత్తులో లారీ నడుపుతూ పట్టుబడిన ఒక వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. రాచర్ల మండల పరిధిలో హైవేపై ఈ నెల 9న డ్రంక్ అండ్ పరీక్షలు చేస్తుండగా ఒంగోలు మండలం త్రోవగుంట గ్రామానికి చెందిన పట్టిం వెంకటరావు పట్టుబడ్డాడు. నిందితుడిని గురువారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి కె.భరత్‌చంద్ర 40 రోజులు జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారని, ఆరు నెలలపాటు లైసెన్స్ రద్దు చేశారని ఎస్సై వివరించారు.

కరేడు రైతుల కోసం పోరాడతాం..



రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉలవపాడు: కరేడు రైతుల కోసం ఎంత వరకు పోరాడేందుకైనా సిద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గురువారం కరేడులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఇక్కడ రైతులు భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని, వారు రాస్తారోకో చేసిన రోజే వామపక్షాలు, వాటి అనుబంధ సంఘాలు అండగా ఉండాలని నిర్ణయించుకున్నాయన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కార్పొరేట్‌ల పక్షమా.. లేక ప్రజల పక్షమా తేల్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ తప్పుడు సమాచారం మీడియాకు చెబుతూ గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి పనులు చేయడం మంచిది కాదన్నారు. ప్రజలతో మాట్లాడకుండా బయట ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఓట్లు వేసిన రైతులకు మేలు చేస్తాడా.. లేక కంపెనీలకు మేలు చేస్తాడా.. అనేది నిర్ణయించుకోవాలన్నారు. భూములు లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు పేర్కొంటున్నారని గుర్తు చేశారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, అవసరం అనుకుంటే మనమే ఒక హత్య చేద్దామని అన్నారు. తాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కూడా మాట్లాడతానని, రైతుల సమస్యలు తెలియజేస్తానన్నారు. రైతుల సమస్యల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలను ఏకం చేస్తామన్నారు. రైతులు అమరావతి రావడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత భూముల వద్ద రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ ప్రసాద్, సీపీఐ ప్రకాశం, నెల్లూరు జిల్లాల కార్యదర్శులు నారాయణ, దామా అంకయ్య, రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమారెడ్డి, కరేడు రైతు ఉద్యమ నాయకులు మిరియం శ్రీనివాసులు పాల్గొన్నారు.

■ సాగుకు సంకటం..


కడ'గండ్ల'కు కారుకులెవరు?

రిజర్వాయర్లు, చెరువుల అభివృద్ధిపై సర్కారు మీనమేషాలు

- తప్పుపట్టిన తూముల షట్టర్లు, దెబ్బతిన్న వాల్వ్‌లు
- చెరువు కట్టలు పటిష్టపరచడంపై సర్కారు అశ్రద్ధ
- వరణుడు కరుణించినా నీరు నిలవడం గగనమే..
- చిల్లచెట్లతో నిండిపోయిన ఆయకట్టు కాలువలు



ఎన్.గొల్లపల్లి రిజర్వాయర్





పునుగోడు రిజర్వాయర్ వాల్‌కు రంధ్రం పడిన చోట మొలిచిన చెట్లు

కనిగిరి రూరల్:

పంట భూములకు సాగు నీరందించి, భూగర్భ జలాల మట్టాన్ని పెంచే రిజర్వాయర్లు, చెరువుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పాలకుల నిర్లక్ష్యం మూలంగా రిజర్వాయర్లలో, చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ సమావేశాల్లో సైతం చెరువుల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు సంధించిన ప్రశ్నలకు అధికారుల నుంచి సరైన సమాధానం కరువైంది. కనిగిరి ప్రాంతంలోని ప్రధాన చెరువులకు ఏర్పడిన గండ్ల వెనుక చేపల కాంట్రాక్టర్ల హస్తం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనిగిరి నియోజకవర్గంలో 100 ఎకరాల ఆయకట్టు ఉన్న మైనర్ చెరువులు 53, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన మోపాడు రిజర్వాయర్ ఉన్నాయి. కనిగిరి మండలంలో పునుగోడు, ఎన్‌గొల్లపల్లి రిజర్వాయర్‌లతోకలిపి 13 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా... 100 ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న చెరువులు 30 వరకు ఉన్నట్లు నివేదికలున్నాయి. ఇక 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు పామూరులో 7, హెచ్‌ఎంపాడులో 3, వెలిగండ్లలో 8, పీసీపల్లిలో 10, సీఎస్‌పురంలో 12 వరకు ఉన్నాయి.

దెబ్బతిన్న తూములు, షట్టర్లు

కనిగిరి నియోజకవర్గంలో మోపాడు రిజర్వాయర్ కింద 12 వేల ఎకరాల ఆయకట్టు, నేలటూరి గొల్లపల్లి మైనర్ రిజర్వాయర్ కింద 2,500 ఎకరాల ఆయకట్టు, పునుగోడు రిజర్వాయర్ కింద 2 వేల ఎకరాల ఆయకట్టు, పందువ గండి రిజర్వాయర్ కింద వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. నేలటూరి గొల్లపల్లి రిజర్వాయర్ కట్ట, తూము, షట్టర్లు, కాలువలు పూర్తిగా అవసాన దశకు చేరాయి. భారీ వర్షం పడితే లీకుల నుంచి ఉధృతంగా నీరు ప్రవహించకుండా ఇసుక బస్తాలు వేసి మమ అనిపించారు. రిజర్వాయర్ రెండు ప్రధాన కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పునుగోడు రిజర్వాయర్ షట్టర్ తుప్పు పట్టి విరిగిపోయింది. రిజర్వాయర్ కట్టకు రంధ్రాలు పడటంతోపాటు చెట్లు మొలిచాయి. కాలువల్లో పిచ్చి మొక్కలు మొలిచి గోడలు నెర్రెలిచ్చాయి. మోపాడు రిజర్వాయర్‌కు గతంలో 5 చోట్ల నీరు ఊటరాగా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టలేదు. కలగట్ల, జమ్మలమడక చెరువు కట్టలు దెబ్బతిన్నా నేటికీ పట్టించుకున్న దిక్కులేదు.

☛ బలహీనంగా మారిన పామూరు పాత చెరువు కట్ట బలోపేతానికి ఎటువంటి నిధులు కేటాయించలేదు. పామూరు కొత్త చెరువు కట్ట సైతం బలహీనంగా మారింది. 2023లో వర్షాలకు చెరువు నీరు కట్టపైకి చేరగా తాత్కాలికంగా బలోపేతం చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వగ్గంపల్లె చెరువు అలుగువద్ద కట్ట దెబ్బతినగా మరమ్మతుల సంగతే మరిచారు.

☛ హనుమంతునిపాడు మండలంలో హాజీపురం, నందనవనం, తిమ్మారెడ్డిపల్లి, మిట్టపాలెం, వీరరాంపురం, వాలిచర్ల చెరువులు మరమ్మతులకు గురయ్యాయి. హాజీపురం, దొడ్డి చింతల చెరువుల కింద 1,250 ఎకరాల ఆయకట్టు ఉంది. పదేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. కట్టపై చిల్ల చెట్లు మొలవడంతోపాటు రాతి కతువ సైతం దెబ్బతింది. చెరువు కాలువలు మరమ్మతులకు గురయ్యాయి.

☛ పీసీపల్లి మండలంలోని 15 మైనర్ ఇరిగేషన్ చెరువులు చిల్లచెట్లతో నిండిపోయాయి. తూముల వద్ద లీకులతో నీరు నిలబడే పరిస్థితి లేదు. గతంలో మారెళ్ల చెరువు వర్షానికి నిండినా తూములకు లీకులు ఏర్పడి నీరంతా వృథాగా పోయాయి.

చేపల కోసమే గండ్లు?

మోపాడు రిజర్వాయర్‌లో చేపలు పట్టుకోవడం కోసం అందులోని నీటిని బయటకు పంపేందుకు కొద్ది నెలల క్రితం కాంట్రాక్టర్లు జేసీబీతో అలుగు వాగుకు గండి కొట్టారు. దీనిపై ఆగ్రహించిన ఆయకట్టు రైతులు, వామపక్షాలు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ విషయం తీవ్ర చర్చకు దారితీసింది. అలాగే పునుగోడు రిజర్వాయర్‌లో చేపల కోసం నీటిని బయటకు పంపేందుకు కాంట్రాక్టర్లు రహస్యంగా రంధ్రాలు వేశారన్న ఆరోపణలున్నాయి. ఇరిగేషన్ అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని, పురాతన కాలం నాటి గోడలు కావడంతో చెట్ల వేర్ల వల్ల రంధ్రాలు పడుతున్నాయని చెబుతున్నారు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> పునుగోడు, నేలటూరి గొలపల్లి షట్టర్లు, తూములు దెబ్బతిన్నది వాస్తవమే. కలగట్ల చెరువు కట్టకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఎన్.గొల్లపల్లి రిజర్వాయర్ మరమ్మతులకు రూ.46 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. పునుగోడు రిజర్వాయర్ షట్టర్‌కు రూ.3 లక్షలతో కొద్ది రోజుల్లోనే మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 30 చెరువుల మరమ్మతులకు రూ.12.70 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. చేపల వేట కోసం నీళ్లను బయటకు పంపించేందుకు గండ్లు కొట్టారన్న ప్రచారంలో వాస్తవం లేదు.
>
> – మధుబాబు, ఇరిగేషన్ జేఈ





ఎన్‌గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పక్కన పడి ఉన్న తూము షట్టర్, రాడ్లు





చిల్లచెట్లతో నిండిన ఎన్.గొల్లపల్లి రిజర్వాయర్ అలుగు కాలువలు

నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు



కొండపిలో రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

కొండపి: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడికి ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, స్టేషన్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. కేసుల రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అడ్డుకట్ట వేసేలా పటిష్ట బీట్ సిస్టంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులో దర్యాప్తు వేగవంతం చేసి ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. గుడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో శిక్షలు పడేలా చూలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలను కట్టడి చేయడానికి ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో శక్తి యాప్ గురించి, వారికి ఉన్న రక్షణ చట్టాల గురించి శక్తి టీం బృందాలపై అవగాహన కల్పించాలన్నారు. నేరం జరిగేందుకు అవకాశం ఉన్న ప్రతి ప్రదేశాల్లో, వాణిజ్య సముదాయాల్లో, నిర్మానుష ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ సోమశేఖర్, కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, పొన్నలూరు ఎస్సై అనూక్, మద్రిపూడి ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ ఖాజావలి, ఎస్సైలు కె.మాధవరావు, శ్రీరామ్‌లు ఐజీకి, ఎస్పీ దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడారు. ప్రస్తుతం హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్ కనిగిరిలో ఉందని, మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భవనం పూర్తయిన వెంటనే అక్కడకు మారుస్తామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళలు, బాలికలపై లైంగిక దాడుల విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: కక్షిదారులు మధ్యవర్తిత్వంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. మధ్యవర్తిత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించే ర్యాలీని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం నుంచి బయల్దేరిన ర్యాలీ సీవీఎన్ రీడింగ్ రూం సెంటర్, కేశవస్వామిపేట జంక్షన్, నగరపాలక సంస్థ కార్యాలయం మీదుగా చర్చిసెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొని 1కే రన్‌ను జయప్రదం చేశారు. అనంతరం చర్చిసెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు, సామాన్య ప్రజానీకానికి అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన మీడియేషన్ టు నేషన్ స్టాల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 59 మంది మీడియేటర్లను నియమించామన్నారు. వీరి ద్వారా వివిధ స్థాయిల్లో ఉన్న వ్యాజ్యాలు పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ర్యాలీలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి.రాజ్యలక్ష్మి, ఎ.పూర్ణిమ, పి.లలిత, జి.దీన, కె.శైలజ, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, ఒంగోలు బార్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, ఒంగోలు నగర డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మా భూములు ఆన్‌లైన్ చేస్తారా లేదా?



ఆర్డీఓ లక్ష్మీప్రసన్న ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు



రిజర్వ్ ఫారెస్ట్ అధికారుల జీపును అడ్డుకున్న రైతులు

- రిజర్వ్ ఫారెస్ట్ అధికారులను నిలదీసిన రైతులు
- 20 ఏళ్ల నుంచి అవస్థలు పడుతున్నామని ఆవేదన
- పూర్తి సమాచారం లేకుండా వచ్చిన ఫారెస్ట్ అధికారులపై ఆర్డీఓ ఆగ్రహం
- కె.పల్లెపాలెం సర్వే నంబర్ 1680లో భూములు పరిశీలించిన అధికారులు

కొత్తపట్నం: తమ భూములను ఆన్‌లైన్ చేయకుండా రెవెన్యూ, రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ 20 ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్నారని కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వ్ ఫారెస్ట్ అధికారుల వాహనాన్ని అడ్డుకుని నిలదీశారు. వివరాలు.. కొత్తపట్నం మండలంలో కె.పల్లెపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 1680లో 119.40 ఎకరాల భూమిని సుమారు 70 ఏళ్ల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో క్రయ విక్రయాలు కూడా జరిగాయి. అయితే భూముల ఆన్‌లైన్ ప్రక్రియ అమల్లోకి వచ్చాక రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఆన్‌లైన్‌లో భూమి చూపించడం లేదన్న కారణంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అది రిజర్వ్ ఫారెస్ట్ భూమి తామేమీ చేయలేమంటూ రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు. రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు మాత్రం అది తమ భూమి కాదంటున్నారు. సుమారు 20 ఏళ్లుగా ఈ రెండు శాఖల అధికారుల మధ్య ఏర్పడిన సమన్వయ లోపం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఓపిక నశించిన రైతులు ఇటీవల గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చారు. దీంతో ఆర్డీఓ లక్ష్మీప్రసన్న గురువారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు సరైన సమాచారం తీసుకురాకపోవడంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, భూముల డాక్యుమెంట్లు, భూముల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రికార్డులు తనఖీ చేసి, సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ఆర్డీఓ చెప్పారు.